పొట్టనింపని 'ఉపాధి'!

- పనితగ్గ వేతనం గిట్టుబాటుకాని వైనం
- అవస్థలు పడుతున్న ఉపాధి వేతనదారులు

పలాస: వలసలను నివారించాలనే ఉద్దేశంతో ఉన్న ఊర్లోనే పనులు కల్పిస్తూ ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం వేతనదారులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారు. పనికితగ్గ వేతనం గిట్టుబాటు కావడం లేదని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీ చాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోలేక మెరుగైన వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. పలాస నియోజకవర్గంలో వ్యవసాయ కార్మికులు, ఇతర పేదవర్గాలు జీడి పరిశ్రమలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం జాబ్‌కార్డు ఉన్నవారికి ఏడాదికి వంద పనిదినాలు కల్పించాలి. మార్చి నెలాఖరుకు ఆ పనిదినాలు పూర్తి కావలసి ఉంది. అయితే ఇప్పటి వరకూ కేవలం 50 పని దినాలు మాత్రమే కల్పించామని కాశీబుగ్గ ఎన్‌ఆర్‌జీఎస్ అధికారులే చెబుతున్నారు. అలాగే పనిచేసిన చోట తగిన సదుపాయాలు కూడా కల్పించడం లేదని వేతనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భోజనాలు చేయడానికి, విశ్రాంతి సమయంలో సేదతీర్చుకోవడానికి టెంట్లు, మంచినీరు, తగిన వైద్య సదుపాయాలు కూడా ఉండాలి. అయితే ప్రస్తుతం అవేమీ లేవని చెబుతున్నారు. గతంలో గునపాలు, గడ్డపారలు, తట్టలు ఇచ్చేవారని ఇప్పుడు అవేమీ సమకూర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలాస మండలంలో మొత్తం 8,750 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. మొత్తం వేతనదారులు 14,497 మందిగా నమోదై ఉన్నారు. అయితే ఇందులో 7,768 మంది జాబ్ కార్డుదారులకే పని కల్పిస్తున్నారు. పలాస మండలంలో ఏడాదికి 11,768 మంది పనిచేస్తున్నప్పటికీ కష్టానికి తగ్గినట్టు వేతనం గిట్టుబాటు కావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వేతనదారుడుకు రోజుకు కనీసం రూ.300 వేతనం రావాలి. అయితే పని సక్రమంగా సాగకపోవడం, మట్టిపనులు చేసే సమయంలో నేల గట్టిగా ఉండడంతో కొలతల ప్రకారం పనులు ఉండడం లేదు. ఫలితంగా రోజుకు రూ.200 నుంచి 250 రూపాయలు మాత్రమే గిట్టుబాటు అవుతోందని వేతనదారులు చెబుతున్నారు. పనులు చేసే దగ్గర సరైన పర్యవేక్షణ కూడా ఉండడం లేదు. దీంతో ఫీల్డు అసిస్టెంట్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని వేతనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



కమలాపురంలో చెరువు గట్టు పనులు చేస్తున్న వేతనదారులు

వేతనం గిట్టుబాటు కావడం లేదు



పేరుకే ఉపాధి. వేతనం గిట్టుబాటు కావడం లేదు. నిన్నటి వరకు చెరువు గట్లు, పూడిక తీత, జంగిల్ క్లియరెన్సు పనులు చేశాం. రోజంతా ఈ పనులు మీద ఆధారపడితే లాభం లేదు. రోజుకు కనీసం రూ.250 రావడం లేదు. పనులు చేసే చోట తగిన సదుపాయాలు కల్పించడం లేదు. అందుకే చాలా మంది ఉపాధి పనులకు బదులు వేరే పనులకు వెళ్లిపోతున్నారు.

– లండ కామయ్య, వేతనదారుడు, రేగులపాడు, పలాస మండలం

చేసే పనికే డబ్బులు చెల్లిస్తాం



ప్రతి వేతనదారుడుకి రోజుకు కనీసం రూ.300 చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం. అయితే వారు చేసే పని ప్రకారమే వేతనం గిట్టుబాటు అవుతుంది. కొలతల ప్రకారమే డబ్బులు చెల్లిస్తున్నాం. ఒక మీటరు వెడల్పు, ఒక మీటరు పొడవు, ఒక మీటరు లోతు ఉన్న ఒక గొయ్యికి రూ.250 ఇస్తున్నాము. వారు ఆ విధంగా ఎంత పని చేస్తే అంత వేతనం వస్తుంది. ప్రస్తుతం పని చేసేచోట టెంట్లు, మంచినీరు తదితర సదుపాయాలు అవసరం లేదని ఇవ్వడం లేదు. ఉదయం పూట వచ్చి పనులు చేస్తున్నారు.

– శంకరరావు, ఉపాధి ఏపీవో, పలాస మండలం

క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ఈదుపురం యువకులు



జగన్‌మోహన్‌రెడ్డితో ఈదుపురం యువకులు

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విజయవాడలో మర్యాద పూర్వకంగా శుక్రవారం కలిశారు. జగన్‌ను కలిసిన వారిలో హంగీర్ బెహరా, యాంగిచ్, ఉమా కాంత్, త్రిలో, గణేష్, కుర్మా, బుభష్‌తో తదితరులున్నారు. తమ అభిమాన నాయకుడును కలుసుకోవడం ఆనందంగా ఉందని యువకులు ఆనందం వ్యక్తం చేశారు.

అండర్-12 జిల్లా క్రికెట్ జట్టుకి ఐదుగురు ఎంపిక



జిల్లా జట్టుకి ఎంపికైన క్రీడాకారులు

ఇచ్ఛాపురం: అండర్-12 జిల్లా క్రికెట్ జట్టుకు ఇచ్ఛాపురం పట్టణంలోని ఐసీసీ క్రికెట్ అకాడమికి చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ దక్కత గోపీ తెలిపారు. జిల్లా జట్టుకి ఎంపికైన సాలిన సాయి డిసోజ్ యాదవ్, సమితిగాడో, దక్ష, ఓంప్రకాష్, మహేష్‌లను సురంగి రాజ్ క్రీడా మైదానం ఆవరణలోని క్రికెట్ అకాడమిలో శుక్రవారం అభినందించారు. సీనియర్ క్రీడాకారులు డి.సుమన్, వెంకటరావు, సీహెచ్ లోహిదాస్, కాళ్ల నరసింహమూర్తి, సాలిన గణేష్, నర్సు నారాయణ, మురళి, యోగి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామస్వరాజ్ అభియాన్ దివస్



బిర్సాముండా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కవిటి: మాణిక్యపురం సచివాలయంలో శుక్రవారం రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) దివస్ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సర్పంచ్ లలితాసాహూ, ఎంపీటీసీ సభ్యురాలు సత్యవతి సాహు తదితరుల పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేవరాజ్‌సాహూ, సంతోష్, బృందావన్, ఢిల్లీ మజ్జి, కంసు శ్రీను పాల్గొన్నారు.

వలకు చిక్కిన కొండ చిలువ



వలకు చిక్కిన కొండచిలువ

ఇచ్ఛాపురం రూరల్: అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు ఏర్పాటు చేసిన వలలో కొండ చిలువ చిక్కింది. ఈ సంఘటన డొంకూరు గ్రామానికి చెందిన సంగారు గంగయ్య తన పంటను పందులు, పక్షుల నుంచి రక్షించుకునేందుకు తన పంట పొలం చుట్టూ వలను కంచెగా ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం పంట పొలం వద్దకు వెళ్లే సరికి వలలో సుమారు ఆరు అడుగుల కొండ చిలువ చిక్కుపోవడంతో స్థానిక రైతుల సహాయంతో వల నుంచి సురక్షితంగా బయటకు తీసి సముద్ర తీర ప్రాంతంలో విడిచిపెట్టారు.

14 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం: మద్యం బాటిళ్లను తరలిస్తున్న కవిటి మండలానికి చెందిన శివంగి మాధవ రావును అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.డి.ప్రసాద్‌రావు తెలిపారు. కవిటి మండలంలో తనిఖీ చేస్తుండగా మాధవరావు 14 బాటిళ్లతో పట్టుబడినట్లు పేర్కొన్నారు.

రోడ్డుపైనే పార్కింగ్..



కవిటి మండలం కొజ్జీరియా జంక్షన్ నుంచి జాడుపుడి-ఆర్ వరకు ఉన్న 16వ నంబర్ జాతీయ రహదారిపై పలు కూడళ్లలో నిబంధనలకు విరుద్ధంగా 16 చక్రాల లారీలు , ట్రాలీలను పార్క్ చేస్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారి వెంబడి ఉన్న హోటళ్లలో భోజనాలు, టిఫిన్ల కోసం ఆగే సందర్భాల్లో పలువురు డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫ్లైఓవర్ పక్క నుంచి సర్వీసు రోడ్డుకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని కార్లు, జీపులు, ఆటో డ్రైవర్లు చెబుతున్నారు. రోడ్డుపై భారీ వాహనాలను పార్కింగ్ చేయకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. –కవిటి

జంగిల్ క్లియరెన్స్ చేపట్టరూ..



కాశీబుగ్గ-అక్కుపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో జంగిల్ క్లియర్ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. కాశీబుగ్గ నుంచి అక్కుపల్లి, బొడ్డపాడుకు వెళ్లే ప్రదాన రోడ్డులో రోజూ వేలాది మంది రాకపోకలు జరుపుతున్నారు. పిచ్చి మొక్కలు రోడ్డుపైకి పెరిగిపోయాయి. దీంతో ఇరువైపుల నుంచి వాహనాలు వచ్చేసమయంలో తప్పించేక్రమంలో రోడ్డుపక్కలు వాహనాలు వస్తే పిచ్చిమొక్కల కొమ్మలు ప్రయాణికులకు తగులుతున్నాయి. ఈ ప్రాంతంలో ఎలుగుబంట్ల సంచారం ఎక్కువగా ఉండడంతో సాయంత్రమైతే ఈ మార్గంలో రావడానికి జనం భయపడుతున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్ చేయాలని కోరుతున్నారు. –కాశీబుగ్గ

దేవదాయ స్థలంలో ఆక్రమణలు!



డివిజన్ కేంద్రమైన టెక్కలి ఆర్టీసీ డిపో సమీపంలో లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన స్థలంలో ఆక్రమణలు మొదలయ్యాయి. పాత జాతీయ రహదారికి ఆనుకుని ఇదే స్థలంలో కొద్దిరోజుల క్రితం వరకు ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్ నిర్వహించేవారు. ప్రస్తుతం దీన్ని మూసివేయడంతో ఆక్రమణలు వెలుస్తున్నాయి. దేవదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన కొంతమంది దిగువ స్థాయి సిబ్బందిని మేనేజ్ చేస్తూ ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఈ స్థలంలో కొన్ని బడ్డీలను ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు స్పందించి స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. –టెక్కలి

చైన్‌స్నాచర్లను అడ్డుకుంటాం

- సాక్షితో డీఎస్పీ వి.వెంకట అప్పారావు



కాశీబుగ్గలోని తన కార్యాలయంలో డీఎస్పీ వెంకట అప్పారావు

కాశీబుగ్గ: చైన్‌స్నాచర్లను అడ్డుకునేందుకు ప్రత్యేక వ్యూహంతో పనిచేయనున్నామని డీఎస్పీ వి.వెంకట అప్పారావు అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో అత్యధిక నేరాలు, చోరీలు, అక్రమణ రవాణా, క్రైంరేటు జరిగే కాశీబుగ్గ పోలీసు డివిజన్‌లో డీఎస్పీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

- కాశీబుగ్గ డివిజన్ ఆంధ్రా-ఒడిశా సరిహద్దును కలిగి ఉంది. ఇటీవల బదిలీలు, పోస్టింగ్‌ల హడావుడిలో సిబ్బంది ఉండిపోవడంతో దొంగలు రెచ్చిపోయారు. వారిని విడిచిపెట్టేది లేదు.
- నాలుగు ప్రాంతాల్లో చైన్స్ స్నాచర్స్ హల్‌చల్ చేశారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. అన్ని కూడళ్లు, షాపుల వద్ద సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని వదలం.



- పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం మున్సిపాలిటీతో పాటు ఇతర మండలాలు, సముద్రతీరం, ఏఓబీ ప్రాంతాలకు సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి, గుట్కా, ఇసుక, మద్యం, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకుంటాం.
- ట్రాఫిక్ జోన్లను గుర్తించి వాహనాల తనిఖీ పక్కాగా చేపడతాం. ఎంవీఐ యాక్టుతో అన్ని రకాల వాహనాలను కంట్రోల్ చేస్తాం.
- టోల్ ప్లాజాను తప్పించుకునేందుకు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల పరిధిలోని ఇరుకైన రోడ్డులో ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు, కోసంగిపురం వద్ద వారిని కట్టడి చేస్తాం.
- ఈవ్‌టీజింగ్, బహిరంగ మద్యం సేవించడం కట్టడికి స్పెషల్ డ్రైవ్ చేపడతాం. ఎక్కడ వేధింపులు జరిగినా పోలీసులకు సమాచారం అందించాలి.

యూటీఎఫ్ పలాస అధ్యక్షులుగా జయరాం



తమ్మినాన జయరాం

కాశీబుగ్గ: పలాస మండల యూటీఎఫ్ అధ్యక్షులుగా తమ్మినాన జయరాం ఎంపిక య్యారు. సంఘ రాష్ట్ర కౌన్సిల్ బల్ల చిట్టిబాబు సమక్షంలో కాశీబుగ్గ హైస్కూల్‌లో నిర్వహించిన ఎన్నికలో జయరాంతోపాటు కార్యవర్గాన్ని ఏకగ్రీకవంగా ఎన్నుకున్నారు.

రెవెన్యూ రికార్డుల్లో లాగిన్‌కు అవకాశం కల్పించండి

సోంపేట: తమ అనుభవంలో ఉన్న అగ్రహారం భూములకు సంబంధించి హక్కుల్ని కల్పిస్తూ రెవెన్యూ రికార్డులలో లాగిన్ అయ్యేందుకు అవకాశం కల్పించాలని రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కొర్లాంకు చెందిన పలువురు రైతులు సోంపేట తహసీల్దార్ అప్పలస్వామిని కలిసి వినతిపత్రం అందించారు. గతంలో అగ్రహారం భూములకు సంబంధించి లాగిన్ అయ్యేందుకు వీలుండేదని.. కానీ ప్రస్తుతం లాగిన్ అవ్వడానికి ఎదురవుతున్న సాంకేతిక సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు ఆర్.జానకీరావు, పి.జోగారావు, పి.ఢిల్లీరావు, ఆర్.అప్పన్న, కె.సుధాకర్, పి మోహనరావు పాల్గొన్నారు.

బాలియాత్రను జయప్రదం చేయండి

కోటబొమ్మాళి: జలుమరు మండలం శ్రీముఖలింగంలో ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరగనున్న కళింగసీమ ప్రాచీన సంప్రదాయమైన బాలియాత్ర పునః ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోటబొమ్మాళి మండల బాలియాత్రా ప్రచారకర్త లఖినేని కరుణాకర్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కోటబొమ్మాళి మండలంలోని 38 పంచాయతీలకు చెందిన ప్రజానీకం హాజరు కావాలని కోరారు. శ్రీముఖలింగం దివ్యక్షేత్రానికి పూర్వవైభవం తెచ్చేందుకు బాలియాత్ర దోహదపుతోందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన బలరాం పాత్రో

కాశీబుగ్గ: గంగువాడ గ్రామం వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌పై వస్తున్న బలరాం పాత్రో అనే వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు 108 అంబులెన్సు సిబ్బంది వెంటనే చేరుకుని ప్రథమ చికిత్స చేసి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు: చెడు వ్యసనాలకు విద్యార్థులు బానిస కావద్దని వజ్రపుకొత్తూరు ఎస్ఐ కె.నిహార్ అన్నారు. పూండిలోని సాయివినీత్ విద్యా సంస్థలో 'సంకల్పం'అనే కార్యక్రమంలో భాగంగా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరుతూ విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.కైలాషరావు, అధ్యాపకులు జి.సాయిగోపాల్ బి.ధర్మారావు, ఎస్.షణ్ముఖరావు ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిహార్

• సాగర తీరం కళకళ



కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం వేకువ జామున భక్తులు డొంకూరు సాగర తీరానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వనభోజనాలకు వచ్చినవారితో తీరం కళకళలాడింది.

– ఇచ్ఛాపురం రూరల్

వంశధార జలాలను సాధిద్దాం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రధాన శివాజీ

కంచిలి: నియోజకవర్గంలో ఉన్న రైతులంతా పార్టీలకతీతంగా సంఘటితంగా మెలిగి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి ఇచ్ఛాపురానికి వంశధార జలాలను తీసుకొచ్చేవరకు విశ్రమించకూడదని నియోజకవర్గ రైతు కులం వంశధార జలసాధన కమిటీ కన్వీనర్ డాక్టర్ ప్రధాన శివాజీ పిలుపునిచ్చారు. కంచిలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఈ మేరకు నియోజకవర్గ రైతులతో కలిసి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వంశధార జలాలను బాహుదా నదికి అనుసంధానించడంతోనే నియోజకవర్గ రైతాంగం భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. జిల్లాకు చెందిన కొందరు స్వార్థపరులైన పెద్దలు ఇన్నాళ్లు ఈ నియోజకవర్గ రైతాంగానికి అన్యాయం చేశారని స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి విమర్శించారు. ఇకనైనా మేలుకొని రాజకీయ లబ్ధిని పక్కనపెట్టి కేవలం రైతాంగం ప్రయోనాలను దృష్టిలో పెట్టుకొని వంశధార జలాలను సాధించేవరకు అలుపెరగకుండా కృషి చేద్దామని కోరారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం ఈ ఐదేళ్లలో వంశధార జలాలను బాహుదా నదికి అనుసంధానించడానికి కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఇప్పిలి క్రిష్ణారావు కోరారు. ప్రభుత్వ పెద్దల సహకారంతో వంశధార జలసాధన పూర్తిచేయడానికి ముందుండి నడిపిస్తామని టీడీపీ నాయకుడు మాదిన రామారావు, జనసేన పార్టీ నేత శమళ్ల వరప్రసాద్ అన్నారు. సమావేశంలో నియోజకవర్గవాప్తంగా ఉన్న రైతు ప్రతినిధులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న నేతలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి: సైబర్ నేరాలు, మత్తు పదార్థాల ప్రభావం పై అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్ కుమార్ సూచించారు. శుక్రవారం రాత్రి టెక్కలి ఎస్సీ బాలికల వసతి గృహం, పెద్దసాన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆర్థిక నేరాలకు బలి కాకుండా జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. అలాగే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదాలు లేకుండా చూడాలని సీఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

వినతులను పరిష్కరిస్తాం



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడి

కాశీబుగ్గ: ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో వచ్చే వినతులకు పరిష్కారం చూపిస్తామని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి తొమ్మిది వినతులు వచ్చాయి. ఆయా వినతులపై చట్ట పరిధిలో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు.

పౌర్ణమి వెలుగులు..



టెక్కలి: ఆర్టీసీ డిపో వద్ద వంశధార సాగునీటి కాలువలో కార్తీక దీపాలను విడిచిపెడుతున్న మహిళలు

కార్తీక పౌర్ణమిని శుక్రవారం భక్తులు ఘనంగా జరపుకున్నారు. ఈ సందర్భంగా దీపారాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సముద్రం, నదులు, చెరువుల్లో దీపాలను వదిలి మొక్కులు చెల్లించుకున్నారు. నదులకు హారతులిచ్చారు. ఆలయాల్లో చేపట్టిన జ్వాలాతోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఇద్దివానిపాలెం తీరంలో కార్తీక దీపోత్సవం



కోటబొమ్మాళి: ప్రత్యేక అలంకరణలో శివపార్వతులు



వజ్రపుకొత్తూరు రూరల్: నగరంపల్లిలోని రామలింగేశ్వర ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



కంచిలి: మఠం చెరువు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



ఇచ్ఛాపురం: బాహుదానదిలో దీపారాధన చేస్తున్న మహిళలు



ఇచ్ఛాపురం రూరల్: సముద్రంలో కార్తీక దీపాలను విడిచి పెడుతున్న భక్తులు